www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 28 మార్చి 2023
5
తూర్పుగోదావరి



ఇద్దరు విద్యార్థులపై మాల్ ప్రాక్టీస్ కేసు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులపై బోర్డు అధికారులు మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు చేశారు. ఫిజిక్స్-2, ఎకనామిక్స్-2 సబ్జెక్టుల పరీక్షలు సోమవారం జరిగాయి. జనరల్ విభాగంలో 42,958 మంది విద్యార్థులకు గానూ 41606 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 1,352 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 4,773 మంది విద్యార్థులకుగానూ 4,478 మంది విద్యార్థులు హాజరయ్యారు. 295 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జగ్గంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఒకరిపై, అడ్డతీగల ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో మరొకరిపై మాల్ ప్రాక్టీస్ నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా 71 పరీక్షా కేంద్రాలను పరిశీలించినట్టు ఆర్ఐఓ ఎన్ఎస్‌విఎల్ నర్సింహం తెలిపారు.

టార్గెట్ల కోసం చలాన్ల బాదుడు

- వెంటపడి వేధిస్తున్న పోలీసులు
- విసుగుపోతున్న వాహనదారులు



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పోలీసులు వాహనదారుల వెంటపడి మరీ చలాన్‌లు వేయడంపై ప్రజల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టార్గెట్‌ల కోసం పోలీసులు ఇష్టారీతిన వ్యవహరిస్తూ సెల్‌ఫోన్‌లలో ఫొటోలు తీయడంపై వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ చలాన్‌ల విషయంలో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలు ఎలా ఉన్నా.. క్షేత్రస్థాయిలో వాహనాల తనిఖీలు, చలాన్‌లు వేయడంలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వినవస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో వాహనదారులు పోలీసులతో వాగ్వాదానికి దిగుతుండగా మరికొన్ని చోట్ల తనిఖీల నుంచి తప్పించుకునే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు జరుగుతున్నాయి.

వాహనదారులు బెంబేలు

ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, వాహనదారుల కనీస భద్రత ప్రమాణాలు పాటించడం లేదంటూ ట్రాఫిక్ పోలీసులు, పోలీసులు విచ్చలవిడిగా చలాన్‌లను విధిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనల పేరుతో ఒక్కో వాహనదారుడికి వారంలో రెండుసార్లు, ఒక్కోసారి ఒకేరోజులో వివిధ చోట్ల రెండుసార్లు చలాన్‌లు పడిన సందర్భాలు అనేక ఉన్నాయి. రాజమహేంద్రవరం నగరంతో పాటు నగరానికి ఆనుకుని ఉన్న వివిధ మండలాల పోలీసులు తనిఖీలు, చలాన్‌లు వేస్తుండడంతో నగరంలో చలాన్ పడనివారికి ఆయా మండలాల పోలీసులు వేస్తున్న చలాన్‌లు కూడా పడుతున్నట్లు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులకు టార్గెట్‌లు, మండల పోలీసులకు టార్గెట్‌లు పైగా సెల్‌ఫోన్‌లలో ఫొటోలు తీస్తూ చలాన్‌లు వేస్తుండడంతో వాహనదారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి వాహనదారులు పారిపోయే పరిస్థితి ఉండటంతో పోలీసుల తీరు ఏవిధంగా ఉందో అర్థమవుతోంది.

సెల్ ఫోన్‌లో ఫొటోలు తీస్తూ

సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం, మద్యం తాగి వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌రూట్‌లో వాహనం నడపడం, రోడ్డుపై పార్క్‌చేసిన వాహనాలకు చలాన్ వేయడం ఇలాంటి అంశాలలో పోలీసులు వాహనాలకు చలాన్‌లు వేయవచ్చు. కానీ ఇష్టారీతిన ఎక్కడపడితే అక్కడ సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీస్తూ చలాన్‌లు వేయడం, బైక్‌తాళం లాక్కొని చలాన్‌లు వేయడం, వాహనాన్ని బలవంతంగా నిలిపి చలాన్‌లు వేయడంపై సామాన్య ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. కొందరు వాహనదారులు పోలీసులతో వాగ్వాదానికి దిగుతున్న సంఘటనలు నిత్యం జరుగుతున్నాయి.

నగరంలో వెంటపడి మరీ..

రాజమహేంద్రవరం నగరంలో ట్రాఫిక్ పోలీసుల తీరు పట్ల వాహనదారులు విస్తు పోతున్నారు. లాలాచెరువు జంక్షన్ వద్ద నగరంలోకి వెళ్లే సర్వీస్ రోడ్డులో ఒకే వాహనం వెళ్లేలా బారికేడ్లు పెట్టి వాహనాలు ఆగగానే వాటిని తనిఖీ చేస్తూ ట్రాఫిక్ పోలీసులు చలాన్‌లు వేస్తున్నారు. ఇదివరకు ఒకరో ఇద్దరో ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహించి చలాన్‌లు వేయగా ఇప్పుడు ఐదారుగురు పోలీసులు ఒకేసారి వాహనదారుల వెంటపడి మరీ చలాన్‌లు విధిస్తున్నారు. రైల్వేస్టేషన్ రోడ్డు, మెయిన్ రోడ్డు, గోకవరం బస్‌స్టాండ్ రోడ్, దేవీచౌక్ జంక్షన్, ఎవి.అప్పారావు రోడ్డు తదితర రద్దీ ఉన్న ప్రాంతాల్లో ఎంపిక చేసుకుని పోలీసులు చలాన్‌లు వేస్తున్నారు. నగరంలో మార్కెట్ల వద్ద పార్కింగ్ చేసే స్థలాలు లేకపోవడంతో వాహనదారులు రోడ్లపైనే వాహనాలు పెట్టి పనులు చేసుకోవడం సహజంగా జరుగుతోంది. అదే అదునుగా పోలీసులు రాంగ్ పార్కింగ్ పేరుతో చలాన్‌లు విధిస్తూ ఆందోళనకు గురి చేస్తున్నారు.

తప్పించుకునే క్రమంలో ప్రమాదాలు

దొంగలను పట్టుకున్నట్లుగా వాహనచోదకుల వెంట పోలీసులు పరుగులు పెడుతున్నారు. పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రమాదాలు జరగకుండా తనిఖీలు చేయడం చలాన్‌లు వేయడం పోలీసుల విధి అయినప్పటికీ తనిఖీలు, చలాన్ విషయంలో పారదర్శకత పాటించాలని అదేవిధంగా వాహనదారులపట్ల మర్యాదగా ప్రవర్తించాలని వాహనదారులు, సామాన్య ప్రజలు కోరుతున్నారు.

'చలో ఢిల్లీ' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కోరుకొండ

మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమం పోస్టర్‌ను సోమవారం కోరుకొండలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రాజులోవ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదలు కార్మిక, రైతు, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మికులకు తీవ్ర ద్రోహం చేసిందన్నారు. మోడీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగం తీవ్ర స్థాయికి చేరిందని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోడీ ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రజల సంపదను విదేశీ స్వదేశీ సంస్థలకు అప్పగించి నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నారన్నారు. దేశానికి వెన్నెముకైన వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించేందుకు భారత వ్యవసాయ చట్టాలకు సవరణలు చేసిందని, వాటికి వ్యతిరేకంగా దేశంలో రైతాంగం ఏడాదిపాటు ఢిల్లీని దిగ్బంధించిందని అన్నారు. మోడీ పాలనలో రికార్డు స్థాయిలో ధరలు పెరుగుతున్నాయన్నారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న వినాశకర విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న సిఐటియు, రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలనిపిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఐటియు, అంగన్‌వాడీ నాయకులు

డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం అండ

ప్రజాశక్తి-గోపాలపురం

మహిళ సాధికారతే లక్ష్యంగా డ్వాక్రా మహిళలకు, అక్క చెల్లెమ్మలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంఎల్ఎ తలారి వెంకట్రావు అన్నారు. సోమవారం గోపాలపురం మార్కెట్ యార్డ్‌లో మూడో విడత వైఎస్ఆర్ చేయూత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ తలారి వెంకట్రావు మాట్లాడుతూ గోపాలపురం మండలంలో 1,267 డ్వాక్రా గ్రూపులకు రూ.10 కోట్ల 7 లక్షల 85 వేల ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. స్వయం ఉపాధి పొందాలనుకునే మహిళలకు ప్రభుత్వపరంగా అండదండలు ఉంటాయని తెలిపారు. లబ్ధి పొందిన డబ్బులతో మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. మహిళా సాధికారత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో త్వరలో ఇళ్ల నిర్మాణ పనులు మొదలుపెట్టనున్నట్టు తెలిపారు. ఇళ్ల స్థలాలు లేనివారు ఎవరైనా ఉంటే 90 రోజులు కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి డ్వాక్రా మహిళలు పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ సుభాషిణి, ఎఎంసి చైర్మన్ గన్నమని జనార్ధన్, ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, ఈళ్ల భాస్కర్ రావు, జడ్పిటిసి కె.లలిత, వెలగా శ్రీరామమూర్తి, మండల సమాఖ్య అధ్యక్షురాలు వింత శ్రావణి, ఎపిఎం సజన, సర్పంచులు పైడి శిరీష, కురుకూరి ధనలక్ష్మి, అన్నెపు వెంకటలక్ష్మి, అన్వర్ బాషా, దండియా, బొమ్మిన నాగరాజు, పోతిరెడ్డి నాగరాజు, ఎస్‌కె.ఖాదర్ వలీ, ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, ముళ్లపూడి వివేక్, ఈర్పిన సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎంఎల్ఎ వెంకట్రావు

ఫూలే, అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-నిడదవోలు

సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి చదువులకు దూరంగా ఉన్న వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే ఆశయంతో పూలే అంబేద్కర్ విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కెవిపిఎస్ నాయకులు జువ్వల రాంబాబు తెలిపారు. నిడదవోలు బిసి కమ్యూనిటీ హాల్లో ఉపాధ్యాయ సంఘం నాయకులు పి.సువర్ణరాజు విజ్ఞాన కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ మహనీయులైన పూలే అంబేద్కర్ పేరుమీద విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చెయ్యటం గర్వించదగ్గ విషయమన్నారు. అనంతరం పది, ఇంటర్ విద్యార్థులకు పరీక్షల కిట్లు, వాలీబాల్ కిట్ అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజా, జి.సన్నీప్రదీప్, మోహన్, గెడ్డం రవీంద్ర, ప్రసన్న రాజు, పేరెంట్స్ కమిటీ అధ్యక్షురాలు ఎన్.ధనలక్ష్మి, జె.నళిని, టి.నాని, రాజేష్ మాట్లాడారు. అనంతరం జెవివి నాయకులు ఎ.దేవేందర్ మ్యాజిక్ షో తో విద్యార్థులను అలరించారు. దాతల సాయంతో 300 మందికి విందు భోజనం ఏర్పాటు చేశారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రతినిధులు, నాయకులు

గిరిజనుల మరణాలపై విచారణ జరిపించాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

గిరిజన ప్రాంతంలో యువకులు, విద్యార్థుల అనుమానాస్పద మరణాలపై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఆదివాసీ మహాసభ డిమాండ్ చేసింది. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ మాట్లాడారు. అడ్డతీగల మండలం బొడ్లంకకు చెందిన రిమాండ్ ఖైదీ కన్నోజి రాజబాబు గత నెల 25న మరణించినట్టు తెలిపారు. రాజబాబును అక్టోబర్ 16న గంజాయితో పట్టుకున్నామని వై.రామవరం పోలీసులు తప్పుడు కేసు నమోదు చేశారన్నారు. గంగవరం మండలం జడేరు గ్రామానికి చెందిన ఏట్ల శివరామ కష్టారెడ్డి జ్వరంతో బాధ పడుతూ నకిలీ ఎంబిబిఎస్ వైద్యుడు గుబ్బల సత్యనారాయణ చికిత్స వల్ల మృతి చెందాడన్నారు. అడ్డతీగల మండలం పైడిపుట్ట గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్ గంగవరం ఆశ్రమ పాఠశాలలో అనుమానాస్పద స్థితిలో మరణించాడని, దేవీపట్నం మండలం ముసినికుంట ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బాలికలు పొడియం యమునశ్రీ, కానెం ఈశ్వరీదేవి వైద్యమందక మరణించారని తెలిపారు. ఈ సంఘటనలపై ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

అందరికీ నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం

ప్రజాశక్తి-ధవళేశ్వరం

ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సదుపాయాలు కల్పించాలన్నదే సిఎం వైఎస్.జగన్ లక్ష్యమని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. సోమవారం రాజమండ్రి రూరల్ ధవళేశ్వరం పిహెచ్‌సిలో ప్రభుత్వం సమకూర్చిన 104 వాహనాలను ఎంపీ భరత్, వైసిపి రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య భద్రతకు సిఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, ఇందు కోసం నిధుల కేటాయింపు విషయంలో వెనుకడుగు వేయడం లేదని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, పిహెచ్‌సిలు, వంద పడకల ఆసుపత్రులను నిర్మిస్తామని, అందుకు తగ్గ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వైద్య సిబ్బంది నియామకంతో ఎంతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యంతో పాటు పట్టణ, నగరాలలో వైద్య సదుపాయాలకు రూ.కోట్ల నిధులు కేటాయిస్తోందన్నారు. రాజమండ్రి నగరంలో ప్రభుత్వాసుపత్రి అభివృద్ధితో పాటు ప్రభుత్వ వైద్యకళాశాలను రూ.వందల కోట్లతో నిర్మిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ ఆకుల వీర్రాజు, మింది నాగేంద్ర, డబ్బింగ్ రమేష్, డిఎంహెచ్‌ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డాక్టర్ కె.సుధాకర్‌రావు, డాక్టర్ ఎ.మేరీ లీడియా, కిశోర్, డి.శేషమణి పాల్గొన్నారు.



104 వాహనాలను ప్రారంభిస్తున్న ఎంపీ తదితరులు

పశువులకు టీకాలు

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లులో సోమవారం పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను ఎంపిపి మట్టా వీరాస్వామి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి జజ్జవరపు రామచంద్రరావు, సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, ఎంపిటిసి సానబోయిన అర్జున రావు, బివి.కృష్ణవేణి, ఎంపిడిఒ బొలిశెట్టి రామ్ ప్రసాద్, పశువైద్య అసిస్టెంట్లు కరిష్మా, విజయలక్ష్మి, గౌతమ్, నాగేశ్వరరావు, అంబేద్కర్ పాల్గొన్నారు.

జెడ్‌పి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-చాగల్లు

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నేషనల్ మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్షిప్ పరీక్షల్లో పలువురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి ఎంపికైనట్టు చాగల్లు జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్ఎం పి.వీర్రాజు తెలిపారు బి.గ్రీష్మ, ఎం.జాహ్నవి, కె.జోయ్ స్కాలర్‌షిప్‌నకు అర్హత పొందారన్నారు. వీరిని విద్యా కమిటీ చైర్మన్ ముద్రగడ కాశీ భగవాన్, వి.శ్రీనివాస రావు, వి.మోహన్ కృష్ణ అభినందించారు.

మాస్టర్ ప్లాన్‌లో మినహాయించాలి

ప్రజాశక్తి-చాగల్లు

మాస్టర్ ప్లాన్‌లో చాగల్లు పంచాయతీని మినహాయించాలని స్పందన కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి.రామకృష్ణ సోమవారం వినతిపత్రం ఇచ్చారు. చాగల్లులో సుగర్ ఫ్యాక్టరీ తెరిపించి రైతులు, కార్మికులు, కర్షకులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కెకె.దుర్గారావు, జుజ్జవరపు శ్రీనివాస్, రైతు సంఘం నాయకులు, గారపాటి వెంకట సుబ్బారావు, కొడవటి వెంకటరాయుడు, కంకటాల బుద్ధుడు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం కొనుగోలుకు ఏప్రిల్ 1వ తేదీ నుంచే పూర్తి స్థాయిలో సన్నద్ధం అవ్వాలని జెసి ఎన్.తేజ్ భరత్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరి సేకరణ కార్యాచరణ, 10వ తరగతి పరీక్షా ఏర్పాట్లు, స్పందన గ్రామ, వార్డ్ సచివాలయ అంశాలు, వేసవి కాలంలో తాగునీటి సరఫరా సమస్యలపై జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

జిల్లాలో ముందస్తుగా కోతలు వచ్చే అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, చాగల్లు, తాళ్లపూడి మండలాల్లో రోజువారీ ఎంత ధాన్యం వస్తుందో అంచనాతో ఉండాలన్నారు. జిల్లాకు 70 లక్షల గన్నీ బాగ్స్ అవసమని, అందుకు తగ్గట్టుగా ఏ మండలానికి ఎన్నిఅవసరమో ముందస్తుగా సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాలో రబీ సీజన్లో 4,55,845 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. జిల్లాలో 18 మండలాల్లో 315 ఆర్‌బికెల పరిధిలో 233 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 147 మిల్లులకు అనుసంధానం చేశామన్నారు. జిల్లాలో ఏప్రిల్ 3 నుంచి 18 వరకు 126 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్టు జెసి తెలిపారు. 26,129 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని, జిల్లావ్యాప్తంగా 21 స్టోరేజ్ పాయింట్స్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రతి సెంటర్‌లో ఫర్నిచర్, ఫ్యాన్స్, లైట్స్, నిరంతర విద్యుత్, టాయిలెట్స్ నిర్వహణ, వేసవి దృష్ట్యా శుద్ధమైన తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

రానున్న వేసవి దష్ట్యా ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా ప్రణాళిక బద్ధంగా రూపొందించిన కార్యాచరణ అమలు చేయాలని ఆదేశించారు. చెరువులు, బోరు పంపులు ముందుగానే మరమ్మతులు చేశారని, ఇంకా ఉంటే యుద్ధప్రాతిపదికన రిపేర్లు పూర్తి చేయాలన్నారు. వేసవి కాలంలో వడగాల్పులు ప్రభావం ఎక్కువగా ఉండే నేపథ్యంలో స్థానికంగా దాతల సహకారంతో చలి వేంద్రాలను ఏర్పాటు చెయ్యాలని సూచించారు. ఆధార్ నవీకరణకు సంబంధించి 2016 నుంచి తదుపరి నవీకరణ చేసుకోని వారు తప్పనిసరిగా 28, 29 తేదీల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాల్లోయ నవీకరణ చేసుకోవాలన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జెసి తేజ్‌భరత్

వైసిపి మండల కమిటీల నియామకం


ప్రజాశక్తి-గోపాలపురం

వైసిపి మండల స్థాయి అనుబంధ కమిటీలను ఎంఎల్ఎ తలారి వెంకట్రావు ప్రకటించారు. సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వైసిపి గోపాలపురం మండల అధ్యక్షులుగా పోతిరెడ్డి నాగరాజు, మహిళా అధ్యక్షురాలిగా ఎండపల్లి కవిత, మండల యూత్ అధ్యక్షునిగా కాసాని సతీష్ కుమార్, ఎస్‌సి సెల్ అధ్యక్షునిగా గల్లా వెంకట శ్రీనివాస్, రైతు విభాగం అధ్యక్షునిగా కోలా రాములు, పంచాయత్ రాజ్ కమిటీలో బేదంపూడి ఝాన్సీ, వాణిజ్య విభాగంలో మద్దు జగన్మోహన్, ప్రచార కమిటీలో నక్కా పోసిబాబు, సేవాదళ్‌లో ముచ్చికర్ల రవి, మైనార్టీ సెల్‌లో మస్తాన్ వలీ, బిసి సెల్‌కు దూదిపాల ప్రభాకర్, ఎస్‌టి సెల్ సుయుకం కన్నయ్యలను నియమించినట్లు తెలిపారు. వీరిని పలువురు అభినందించారు.



కమిటీల వివరాలు వెల్లడిస్తున్న ఎంఎల్ఎ వెంకట్రావు

కార్టూ'నిజం'



వర్షాలతో నేలకొరిగిన మొక్కజొన్న

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పలు లంక ప్రాంతాల్లో అకాల వర్షాలకు మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. దెబ్బతిన్న పంటల లెక్కలపై రైతుల్లో తీవ్ర అసంతప్తి నెలకొంది. పంటనష్ట అంచనాలు ఇంకా పూర్తి కాలేదు. ఈదురు గాలులు, వడగళ్ల వాన రైతులను అతలాకుతలం చేసింది. మండలంలోని పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టిన రైతులు లబోదిబోమంటున్నారు. దెబ్బతిన్న పంటలకు సంబంధించి అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించడంలో విఫలం చెందారు. రైతులకు త్వరితగతిన నష్ట పరిహారం అందించాల్సి ఉన్నప్పటికీ మందకొడిగా నష్ట అంచనా సాగుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు చెబుతున్న ప్రాథమిక అంచనాలపై రైతులు తీవ్ర అంసతప్తి వ్యక్తం చేస్తున్నారు. సాగు చేసిన పంటలో 33 శాతం దెబ్బతింటేనే నష్టం జాబితాలో చేరుస్తామంటున్నారని, దీంతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారనుందని రైతులు చెప్పుకొస్తున్నారు. అకాల వర్షాలకు పెద్దఎత్తున దెబ్బతిన్న పంటల్లో దెబ్బతిన్నట్లుగా చెబుతుండగా ఒక్క సీతానగరం మండలంలోనే మొక్కజొన్న పంట నష్టం పెద్దఎత్తున ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ మండలంలో సీతానగరం లంక ప్రాంతాల్లో వందల ఎకరాలకుపైగా మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు రైతులు చెబుతున్నారు. పంటనష్టం పెద్దఎత్తున జరిగినట్లు రైతులు చెబుతున్నా అధికారుల లెక్కలు మాత్రం నామమాత్రంగా ఉన్నాయి. 33 శాతం నిబంధన పేరిట దెబ్బతిన్న పొలాలను సైతం లెక్కల నుంచి పక్కన పెడుతున్నట్లు తెలుస్తోంది. పెద్దఎత్తున కూలిన మొక్కజొన్న పంట తోటలనే లెక్కల్లోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. పంటనష్టం అంచనాలకు సంబంధించి పూర్తిస్థాయిలో జరగాల్సి ఉంది. పంట నష్టం నమోదు ప్రక్రియ ప్రారంభించినట్లు చెబుతున్నా చురుగ్గా సాగుతున్న దాఖలాల్లేవు. సీతానగరం రైతు భరోసా కేంద్రం అగ్రికల్చర్ విఎఎలకు రైతులు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటనష్టం అంచనాలపై నిబంధనలు సడలించి రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. మొక్కజొన్న రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉందని రైతులు లబోదిబోమంటున్నారు. అంచనాలన్నీ గోల్‌మాల్‌గా ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రాథమిక అంచనాలపై వ్యవసాయాధికారులు కనీసంగా ప్రకటన చేయని పరిస్థితి జిల్లాలో నెలకొంది. పంటనష్టంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే చర్చ రైతుల్లో సాగుతోంది. దెబ్బతిన్న పంటను లెక్కించి పరిహారం త్వరితగతిన అందించేలా చూడాలని రైతులు కోరుతున్నారు. పంటనష్టానికి ఇచ్చే పరిహారంపైనా రైతుల్లో తీవ్ర చర్చ సాగుతోంది. పెట్టుబడులు ఎక్కువగా ఉన్న కాలంలో చేపట్టిన లెక్కల ప్రకారమే పరిహారం ఇస్తుండటంపై రైతుల్లో తీవ్ర అసంతప్తి వ్యక్తమవుతోంది. పెట్టుబడులు భారీగా పెరిగిన నేపథ్యంలో పంట నష్టపరిహారం సైతం పెంచాలని రైతులు కోరుతున్నారు. నిబంధనలు సడలించి రైతలకు న్యాయం చేయాలని కోరారు. అకాల వర్షం, వడగళ్ల వానలకు తీవ్ర పంట నష్టం వాటిల్లింది. నిబంధనల పేరుతో నష్టం అంచనాలను తక్కువ చేసి చూపిస్తున్నారు. ఉద్యాన, ఆహార పంటలు పెద్దఎత్తున దెబ్బతిన్నాయి. పంటనష్టం అంచనాల్లో 33 శాతం నిబంధనను సడలించి పంటనష్టం నమోదు చేయాలి. ఎంతమేర పంటనష్టం జరిగిందో నమోదు జరగాలి. వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని రైతులు ఆవేదన చెందుతున్నారు.



సింగవరంలో నేలకొరిగిన మొక్కజొన్న పంటతో రైతు



అల్పాహారం అందిస్తున్న మానవత సంస్థ సభ్యులు

ప్రణాళికతోనే ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి-తాళ్లపూడి

విద్యార్థులు ప్రణాళికలు సిద్ధం చేసుకుని చిన్నతనం నుంచే చదువుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పలువురు మానవత సంస్థ సభ్యులు అన్నారు. మండలంలోని గజ్జరం గ్రామంలోని ఉన్నత పాఠశాలలో 42 మంది 10వ తరగతి విద్యార్థులకు మానవత శాఖ సోమవారం అల్పాహారాన్ని అందజేసింది. ఈ సందర్భంగా మానవతా శాఖ అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ లక్ష్యాల సాధనకు నిరంతరం చదువులో శ్రమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోడాలతో పాటు రీజనల్ ఛైర్మన్ వి.చంద్రయ్య కార్యదర్శి ఎస్.సుబ్బారావు సహాయ కార్యదర్శి పి.దుర్గాప్రసాద్, ఇసి సనపల రాజశేఖర్, హెచ్ఎం రవిబాబు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆటో ప్రమాదంలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

లచ్చిపాలెం పరిధిలో జాతీయ రహదారి 216 పై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మహిళ ఉపాధ్యాయులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కాకినాడ నుంచి ఆటోలో ఇంజరం హైస్కూల్‌కి వెళుతున్న ఉపాధ్యాయులు ఉన్న ఆటో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి మరో ప్రమాదానికి గురై రోడ్డుపై ఉన్న కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు లంకే చంద్రావతి, ఉపాధ్యాయులు సుభద్ర, విద్యాలక్ష్మి, నీరజలకు గాయాలయ్యాయి. ఉపాధ్యాయిని సుభద్రకు తీవ్ర గాయాలు కాగా చేయి విరిగినట్లు తెలిసింది. కోరంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - గండేపల్లి

తాళ్లూరు గ్రామ శివారులోని పాన్ షాప్‌లో మద్యం విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు గండేపల్లి ఎస్ఐ గణేష్ కుమార్ షాప్ పై దాడి చేశారు. మద్యం అమ్ముతున్న మార్ని త్రిమూర్తులును అరెస్ట్ చేసి అతని వద్ద నుండి రూ.3350 విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీన చేసుకుని అతని పై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం పెద్దాపురం కోర్ట్‌కు తరలించారు. ఎవరైనా అక్రమ మద్యం అమినా, దాబా హోటల్లో మందు సిట్టింగులు పెట్టిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



విజిలెన్స్ దాడుల్లో సీజ్ చేసిన సిలిండర్లు

విజిలెన్స్ దాడుల్లో 6 సిలిండర్లు సీజ్

ప్రజాశక్తి- ధవళేశ్వరం

విజిలెన్స్ ఎస్‌పి పివి.రవికుమార్ ఆదేశాల మేరకు సోమవారం ధవళేశ్వరంలో ఒక క్యాటరింగ్ పాయింట్‌లో నిర్వహించిన దాడుల్లో ఆరు గృహ వినియోగ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. ఇమ్మి క్యాటరింగ్ పాయింట్ యజమాని నేతల ఇమ్మాన్యుయేల్‌పై 6ఎ కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, కానిస్టేబుల్స్ వలీ, లోవకుమార్ రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు పాల్గొన్నారు.

కాలువలోకి లారీ బోల్తా

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని తాపేశ్వరం గ్రామంలో మూడు విగ్రహాల వద్ద ఉన్న పంట కాలువలో గ్రావెల్ లారీ ఆదివారం అర్ధరాత్రి బోల్తా పడింది. ఆ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న పనుల కోసం గ్రావెల్ తీసుకువచ్చిన లారీ రోడ్డు అంచు దిగిపోయి కాలువలోకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వేగంగా అర్జీల పరిష్కారం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

స్పందనలో వచ్చిన ప్రతి అర్జీనీ నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని జెసి ఎన్.తేజ్ భరత్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యాక్రమంలో ఆయన డిఆర్ఒ జి.నరసింహులుతో కలసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ స్పందన వినతుల పరిష్కారంలో నాణ్యతా ప్రమాణాలను మెరుగుపరచుకొని పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. స్పందన కార్యాక్రమంలో స్వీకరించే ప్రతి దరఖాస్తునూ 24 గంటల్లో ఓపెన్ చేయ్యాలని స్పష్టం చేశారు. మండల స్థాయిలో కూడా అర్జీలను నాణ్యత కలిగిన పరిష్కారం కోసం చర్యలు పెరగాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న స్పందన కార్యక్రమంలో ఏ ఒక్కరూ నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శించకుండా జవాబుదారీతనంతో పరిష్కరించాలని, ఏ ఒక్క దరఖాస్తు మార్గదర్శక పరిధి దాటి వెళ్లకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలన్నారు. సోమవారం ప్రజల నుంచి 113 అర్జీలు స్వీకరించామని జెసి తెలిపారు.



స్టాలిన్‌ను పరామర్శిస్తున్న జక్కంపూడి గణేష్

స్టాలిన్‌కు గణేష్ పరామర్శ

ప్రజాశక్తి-కడియం

ఇటీవల కంటి శస్త్ర చికిత్స చేయించుకుని, ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్‌ను వైసిపి యువనేత జక్కంపూడి గణేష్ సోమవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వేమగిరి మాజీ సర్పంచ్ వెలుగుబంటి వెంకటాచలం, ఎంపిటిసి ఆకుల సుధాకర్, యడ్ల రాజారమేష్, పథ్వీరాజ్, రాయుడు రాజేష్, రంకిరెడ్డి వీరకష్ణ, సాకా కిరణ్, తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

ప్రజాశక్తి-పెరవలి

పౌష్టికాహారంతో రక్తహీనతను నివారించవచ్చని సిడిపిఒ ఎం.శ్రీలక్ష్మి అన్నారు. పెరవలి ఐసిడిసి కార్యాలయంలో సోమవారం పోషణ పక్వాడ కార్యాక్రమలో ఆమె మాట్లాడారు. బాలింతలు, గర్భిణులు, కిషోర్ బాలికలు పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత నుంచి దూరం కావచ్చన్నారు. మిల్లెట్స్ తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ముడి మినుముల వాడకం వల్ల ఎముకులు పటిష్టంగా ఉంటాయని, వీటిలో ఫైబర్, ఐరన్, పొటాషియం బి 3 బి 12 మెండుగా ఉంటుందన్నారు. అనంతరం చిన్నారుల బరువులు ఎత్తులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సిహెచ్.లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



లేగ దూడల ప్రదర్శన ప్రారంభిస్తున్న ఎంపిపి రాయుడు సునీత

పశువులకు కృత్రిమ గర్భధారణే మేలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

కృత్రిమ గర్భధారణ పద్ధతులే పశుగణాభివృద్ధికి మేలు చేస్తుందని పశుసంవర్ధక శాఖ ఎడి. బ్రహ్మ వేద తెలిపారు. పోలేకుర్రు పంచాయతీ పరిధిలో పత్తిగొంది పశు వైద్యాధికారి డి. సుధా ఆధ్వర్యంలో జరిగిన లేగ దూడల ప్రదర్శనను ఎంపిపి రాయుడు సునీత ప్రారంభించారు. ఈ సందర్భంగా కృత్రిమ గర్భధారణ ద్వారా జన్మించిన ఉత్తమ లేగ దూడలను ఎంపిక చేసి ఆయా రైతులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మేలు జాతి పశువులు, పెంపకం, సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రైతులకు తెలియజేశారు. కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు కావలసిన రైతులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ ప్రదర్శనలో పంపన బుజ్జి అనే రైతుకు చెందిన పుంగనూరు దూడకు మొదటి బహుమతి, వలవల గోవిందుకు చెందిన జెర్సీ దూడకు రెండో బహుమతి, త్రిమూర్తులకు చెందిన ముర్రా జాతి దూడకు మూడో బహుమతి లభించింది. కార్యక్రమంలో సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, జడ్‌పి మాజీ చైర్మన్ జనార్ధన రావు, ఎఎంసి చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, వైస్ ఎంపిపి నాగేంద్రప్రసాద్, ఎంపిటిసి బల్ల సంధ్యారాణి, రాయుడు గంగాధర్, పోలేకుర్రు పంచాయతీ కార్యదర్శి జ్యోతి సుధ, సుమారు 40 మంది రైతులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో డ్రగ్స్ మాఫియా

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఆంధ్రప్రదేశ్ డ్రగ్స్ మాఫియాకు అడ్డాగా మారిందనిటిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ తీవ్ర విమర్శలు చేశారు. కాకినాడ జిల్లా పార్టీ కార్యా లయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు. ముందుగా కీ.శే. వరుపుల రాజా మతి కి రెండు నిమిషాలు మౌనం పాటించి అనంతరం రాజా సతీమణి సత్యప్రభకు ప్రత్తిపాడు ఇన్చార్జ్ ఇచ్చి నందుకు చంద్రబాబు నాయుడుకి కతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో 7.5 లక్షల కిలోల గంజాయి పట్టుబడితే ఒక్క ఆంధ్ర లోనే 26 శాతం గంజాయి పట్టు బడటం జగన్ రెడ్డి అవినీతికి పరాకాష్ట అని అన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరుమల తిరుపతి దేవస్థానం కొండపై డ్రగ్స్, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు.. మోస పూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి మద్యపానం నిషేధిస్తానని హామీ ఇచ్చి మాట తప్పారని, దీంతో మధ్యతరగతి కుటుంబాల వారు రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, సమావేశంలో, తూము కుమార్, కాకినాడ రూరల్ పార్టీ అధ్యక్షుడు రామదేవు సీతయ్య దొర, చప్పిడి వెంకటేశ్వరరావు, కొల్లాబత్తుల అప్పారావు, అనుకూల శ్రీకాంత్, జిలాని, ఉండవల్లి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - రౌతులపూడి

ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ శివకుమార్ అన్నారు. బలరామపురంలో సర్పంచ్ దాసరి సన్యాసి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. వివాదాలకు తావు లేకుండా సర్వే చేపట్టి రికార్డులను నమోదు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి గంటిమల రాజ్యలక్ష్మి, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సత్యనారాయణ డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ, గోవింద్ కుమార్ తదితరులు ఉన్నారు.

యానాం వార్తలు



:అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎంఎల్ అశోక్

ప్రజా పనుల శాఖలో అవకతవకలపై విచారణ చేయాలి

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రజా పనుల (పిడబ్ల్యుడి) శాఖలో జరుగుతున్న అవకతవకలపై విచారణ నిర్వహించాలని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం పుదుచ్చేరి అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. యానాం నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధిపనులను పిడబ్ల్యుడి అధికారులు అడ్డుకుంటున్నారన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన కోట్లాది రూపాయిల నిధులను ఖర్చు చేయకుండా వాటిని ఎందుకు తిరిగి వెనుకకు మళ్లిస్తున్నారని పిడబ్ల్యుడి మంత్రి లక్ష్మీనారాయణను ప్రశ్నించారు. నియోజకవర్గ పరిధిలో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉన్నాయని వీటి నిర్మాణాలకు తక్షణం నిధులు మంజూరుచేయాలని కోరారు. దీనిపై మంత్రి లక్ష్మీనారాయణ సమాధాన మిస్తూ యానాంకు సంబంధించి 50కి పైగా వివిధ పనులకు నిధులు మంజూరుచేస్తామని హామీ ఇచ్చారని ఎంఎల్ఎ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

నీటిని వృథా చేయొద్దు ఘనంగా ప్రపంచ జల దినోత్సవం

ప్రపంచ జల దినోత్సవం దశ దిశ ఉత్సవంలో భాగంగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర పర్యావరణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం దంగేటి త్రిమూర్తులు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కెవివి రాష్ట్ర నాయకులు సత్యనారాయణ మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక సైన్సు ప్రచారం చేసే సంస్థ అని, నేడు మనం అనుభవిస్తున్న సౌకర్యాలు, యంత్రాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు అన్నీ సైన్సు అందించిన ఫలితాలే అని విద్యార్థులకు వివరించారు. దశ దిశ ఉత్సవాలు మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 'నీటిని పొదుపు చేయండి' 'నీటిని వృథా చేయవద్దు.. మున్సిపల్ కుళాయి నీటిని పొదుపుగా వాడండి' అని గ్రామ వీధులలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు.

హెచ్ఐవి పై అవగాహన సదస్సు

యానాం ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ చైల్డ్ లైన్ ఆధ్వర్యంలో హెచ్ఐవిపై అవగాహన సదస్సు కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. కె శ్రీనివాస్ మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ బాధితులను సమాజంలో ఏ విధంగా భాగస్వామ్యం చేసుకోవాలో,ప్రభుత్వ స్వచ్ఛంద సేవా సంస్థలు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పిఎం కరుణాకర్ ల్, చైల్డ్ లైన్ సిబ్బంది కెదేవి శ్రీదేవి, హెచ్ నూకరత్నం, ఎం.గీత, విజయలక్ష్మి, కె.శాంతకుమారి, పి.మంగాదేవి, రేవతి తదితరులు పాల్గొన్నారు.



మునిస్వామిని సత్కరిస్తున్న నూతన మున్సిపల్ కమిషనర్ గోయెల్

నూతన మున్సిపల్ కమిషనర్‌గా గోయెల్ బాధ్యతల స్వీకరణ

యానాం నూతన మున్సిపల్ కమిషనర్‌గా ద్విజ్ గోయెల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన నూతన కమిషనర్ ఆర్ఎఒ మునిస్వామిని కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం మున్సిపాల్ ఉద్యోగులు కలిసి కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.



సిఎం రంగసామి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

ఫలించిన ఓచర్ పెయిడ్ ఉద్యోగుల ఉద్యమం

యానాం ప్రజా పనుల శాఖలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఓచర్ పెయిడ్ ఉద్యోగుల ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేసిన ఉద్యమం ఫలిం చింది. ఈ మేరకు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావడంతో ఆందోళనలు ఇక్కడితో విరమించారు. సోమవారం జరిగిన పుదుచ్చేరి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సీఎం రంగస్వామి ఓచర్ పెయిడ్ ఉద్యోగులకు ప్రకటించిన రూ.15వేల నుండి రూ.18 వేల జీతం పెంచుతు న్నట్లు ప్రకటించారు. ఉద్యోగులు సీఎం రంగస్వామికి కృతజ్ఞతలు తెలుపుతూ బాణాసంచా కాల్చి, సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

నడకదారి భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించండి

డయల్ యువర్ ఇఒకు పలువురి వినతి

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం దేవస్థానం కొండపైకి మెట్ల మార్గం ద్వారా వెళ్లే యాత్రికులకు ప్రత్యేక దర్శనం కల్పించాలని సోమవారం కొండపైన డయల్ యువర్ ఇఒ నిర్వహించిన కార్యక్రమంలో అన్నవరానికి చెందిన డి మురళి సూచించారు. బైపాస్‌లో ఉన్న సత్యదేవుని నమూనా ఆలయం వద్ద మెయిన్ రోడ్‌లో తొలి పావంచా వద్ద ఉన్న బాత్ రూములు అపరిశుభ్రంగా ఉన్నాయని దుర్గంధం వస్తోందని విశాఖపట్నం చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు వన దుర్గ ఆలయంలో సేవా టిక్కెట్లు తీసుకున్న భక్తులకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ప్రసాదం అందడం లేదని తునికి చెందిన ఒకరు ఫిర్యాదు చేశారు. బైపాస్ నమోనా ఆలయం వద్ద పండ్ల దుకాణం వేలం నిర్వ హించాలని, దేవస్థానం అనంత లక్ష్మి సత్రం వద్ద కబ్జా స్థలాన్ని ఖాళీ చేయించి దేవస్థానం షాప్ లు కట్టిస్తే ఆదాయం వస్తుందని, రహదారి విస్తరణ పెరుగుతుందని స్థానికుడు ఈర్లు శ్రీనివాస్ సూచించారు. ఈ సందర్భంగా ఈవో ఆజాద్ మాట్లాడుతూ భక్తులు అందించిన పలు సలహాల మేరకు సమస్యలు సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు.



డయల్ యువర్ ఇఒలో సమస్యలు వింటున్న చంద్రశేఖర్ ఆజాద్

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని చివటం గ్రామం నుంచి పాలంగి వరకూ నిర్మిస్తున్న బిటి రోడ్డు పనులను వైసిపి మండల కన్వీనర్ కఠారి సిద్ధార్థ రాజు సోమవారం పరిశీలించారు. గోతులు, గుంతల మయమై ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందిగా ఉన్న రోడ్డు నిర్మాణానికి నిధులను ఎంఎల్ఎ జి.శ్రీనివాస్ నాయుడు మంజూరు చేశారని ఆయన తెలిపారు. పనులను నాణ్యతతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని ఎంఎల్ఎ ఆదేశించారని రాజు తెలిపారు. ఈ తారు రోడ్డు పనులు రెండు రోజుల్లో పూర్తి చేస్తామని, అనంతరం చివటం గ్రామంలో సిసి రోడ్డును రెండు నెలల్లో పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ డిఇ మణికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ త్రిసభ్య కమిటీ అధ్యక్షులు కొఠారు సత్యనారాయణ, వైసిపి నాయకులు దాసరి మునిరాజు, గోడి శ్రీనివాస్, అరిగెల రాధాకృష్ణ, చిటికెన ముత్యాలరావు, జి.చినవెంకన్న, వీరమల్లు మురళీకృష్ణ, పి.శ్రీనివాస్, మాచవరపు వెంకట హరికష్ణ ఉన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న నాయకులు



జెసిని అభినందిస్తున్న అధికారులు

జెసి తేజ్ భరత్‌కు పలువురి అభినందన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ముస్సోరిలో ఇటీవల శిక్షణ అనంతరం విధుల్లో చేరిన జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్‌ను సోమవారం జిల్లా అధికారులు అభినందించారు. శిక్షణ అనంతరం నిర్వహించే పోటీ పరీక్షల్లో 139 మంది పాల్గొనగా వారిలో జెసి తేజ్ భరత్ ప్రథమ స్థానం దక్కించుకున్నారు. బృంద విభాగంలో సభ్యునిగా 'భారత దర్శనం' అంశంపై ప్రెజెంటేషన్‌లోనూ జెసి ప్రథమ స్థానంలో నిలిచారు. ఆయనను అభినందించిన వారిలో డిఆర్ఒ జి.నరసింహులు, టూరిజం ఆర్ఎం వి.స్వామినాయుడు, డిసిహెచ్ఒ డాక్టర్ సనత్ కుమారి, సిపిఒ కె.ప్రకాశరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్. మాధవరావు, పశు సంవర్ధక శాఖ అధికారి ఎస్‌జిటి సత్యగోవిందం, పిఆర్ ఎస్ఇ ఎస్‌బివి. ప్రసాద్, డ్వామా పీడీ జిఎస్.రామగోపాల్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ కె.విజయకుమారి, డిఇఒ అబ్రహాం తదితరులు ఉన్నారు.

'వంగపండు' కుటుంబానికి 'గోరంట్ల' పరామర్శ

కడియం : పితృ వియోగంతో బాధపడుతున్న కడియం సీనియర్ జర్నలిస్టు వంగపండు వీరభద్రరావు సోదరులను సోమవారం రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి పరామర్శించారు. ఈ సందర్భంగా రామకష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో మండల టిడిపి అధ్యక్షులు వెలుగుబంటి నాని, మత్సేటి ప్రసాద్ ఉన్నారు.

పేద విద్యార్థికి మానవత సాయం

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి మండలం మానవతా సంస్థ వారు కృష్ణంపాలెం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని కడలి నాగశ్రీకి చదువు కోసం రూ.ఐదు వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కేసిరాజు సీతారామయ్య, కేసిరాజు రాజకుమార్, మండల చైర్మన్ బలుసు సత్యనారాయణ, వైస్ చైర్మన్ పప్పు వెంకట రామారావు, యలమాటి సత్యనారాయణ, ఆచంట రాంబాబు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ భరత్, చందన తదితరులు

విగ్రహ ప్రతిష్ఠాపనలో ప్రముఖులు

ప్రజాశక్తి-కడియం

మాధవరాయుడుపాలెంలో నిర్మించిన భువనేశ్వరీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో సోమవారం పలువురు ప్రముఖులు పాల్గొని పూజలు చేశారు. ఎంపీ మార్గాని భరత్ రామ్, ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చియ్య చౌదరి, మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ, జనసేన నేత కందుల దుర్గేష్, వైసిపి రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, గిరజాల బాబుఅ, సర్పంచ్ అన్నందేవుల చంటి పాల్గొన్నారు.

నేడు 104 వాహన ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-పెరవలి

పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కొత్తగా మంజూరైన 104 సంచార వైద్య వాహనాన్ని మంగళవారం దీపిక కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ వద్ద ఎంఎల్ఎ జి.శ్రీనివాస్ నాయుడు ప్రారంభిస్తారని వైద్యాధికారి ఎహెచ్.విజయకుమార్, ఎ.సత్యకృష్ణవేణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపిటిసిలు హాజరు కావాలని ఆయన కోరారు.